మహేశ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఆర్టీసీ డిపో అధికారులు

మద్యం సేవించి వాహనాలు నడుపొద్దు

జనగామ, జనవరి 9 (నమస్తే తెలంగాణ) : రోడ్డు భద్రత నిబంధనలను డ్రైవర్లు పాటించాలని, మద్యం సేవించి వాహనాలను నడుపొద్దని రవాణా శాఖ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ మహేశ్‌గౌడ్ అన్నారు. ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవంలో భాగంగా గురువారం జనగామ ఆర్టీసీ డిపోలో మెయింటనెన్స్‌డే నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అతివేగంగా వెళ్లకుండా వాహనాలను నడపాలన్నారు. వాహనాలను కండిషన్‌లో ఉంచుకోవాలన్నారు. అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) రాఘవేంద్ర మాట్లాడుతూ వాహనదారులు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు జరగవని అన్నారు. మంచి అటెండన్స్, పెర్ఫార్మన్స్ కలిగిన మెకానిక్ శ్రామిక్‌గా ఉత్తమ మెకానిక్‌లుగా ఎంపికైన ఎం ప్రభాకర్, అజ్మత్‌బేగ్‌ను అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్లు రవీందర్, వై యాదమణిరావు, అకౌంటెంట్ హరిలాల్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు, డీఏలు విడుదల చేయాలి

నర్మెట, జనవరి 9: ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల బిల్లులతో పాటు ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ మండల కన్వీనర్ భూక్యా శివరాంనాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయం వద్ద సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో అయిలయ్య, సెక్టోరల్ అధికారి రాజు, ప్రధానోపాధ్యాయులు ఎన్ వేణు, వాసురెడ్డి, అంజనేయులు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కనకారెడ్డి

సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

జనగామ చౌరస్తా, జనవరి 9 : సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు జరిగే సీపీఎం 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మహాసభల ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. కనకారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో విద్య, వైద్యం పేదలకు అందుబాటులో లేదన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. మహిళలపై లైంగిక దాడులు, హత్యలు, గృహహింస పెరిగిపోయాయని పేర్కొన్నారు. దళిత, గిరిజనులు అభివృద్ధిలో వెనుకబాటుకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇర్రి అహల్య, సభ్యులు జోగు ప్రకాశ్, ఉపేందర్, లింగం, సుధాకర్, కల్యాణ్, కనకాచారి పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

జనగామ చౌరస్తా, జనవరి 9 : అమ్మ ఆదర్శ పాఠశాలలు, వసతి గృహాల్లో అభివృద్ధి పనులతోపాటు వరదలకు కొట్టుకుపోయిన రోడ్లను పునరుద్ధరించాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 309 ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు గుర్తించగా, వీటిలో 220 పాఠశాలల్లో పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. చేసిన పనులకు యుటిలైజేషన్ సర్టిఫికెట్ పొంది, బిల్లుల చెల్లింపు నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ప్రతి మండల కార్యాలయంలో ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఇంటి, నల్లా పన్నులను వంద శాతం సేకరించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ప్రతి మండలంలో బ్రిక్ తయారీ యూనిట్ ఏర్పాటుకు సంబంధిత అధికారులను శిక్షణకు పంపించాలని కోరారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో మాధురీ షా, డీఆర్డీవో వసంత, డీఈవో రమేశ్, డీపీవో స్వరూప, సీపీవో పాపయ్య, ఎస్సీఎం కోఆర్డినేటర్ కరుణాకర్, బీసీ, ఎస్సీ సంక్షేమశాఖ అధికారులు రవీందర్, విక్రమ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

పాస్‌పోర్ట్ పోయినది

నేను, ఏదునూరి మమత D/o ఏదునూరి సంపత్ నా యొక్క పాస్‌పోర్ట్ డిసెంబర్ 16న కమలాపురం నుండి మంగపేటకు వెళుతుండగా దారిలో ఎక్కడో పడిపోయినది. నాపాస్‌పోర్ట్ నెం. M8425867 గల పాస్‌పోర్టు మంగపేట, గాని ఇతర ప్రాంతాలలోని ఎవరికి అయిన దొరికితే మంగపేట పోలీస్ స్టేషన్‌లో కానీ, లేదా నా ఫోన్ నెం. 9490395672, 7330780394 లలో గాని సంప్రదించి ఇవ్వగలరని ప్రార్థన.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

శ్రీనివాస్ సూర్యప్రకాశ్

డీటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

పాలకుర్తి, జనవరి 9: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు ఇప్ప రాంరెడ్డి, ఉపాధ్యక్షుడు ఎం డీ షరీఫ్ ఆధ్వర్యంలో ఎన్నిక లు నిర్వహించారు. మండల అ ధ్యక్షుడిగా చిదిరాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా దేవగిరి సూర్యప్రకాశ్, ఉపాధ్యక్షులుగా శోభారాణి, కమలాకర్‌రెడ్డి, విజేందర్, కార్యదర్శులుగా శ్రీనివాస్, ఆశోక్, ప్రణయ్, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా షరీఫ్, సీహెచ్ వెంకటాచారి, అడిట్ కన్వీనర్‌గా యాక య్య, సభ్యులుగా ఎన్ శ్రీనివాస్, మెహర్‌న్నీషా భేగం ఎన్నికయ్యారు.

ముగ్గురిపై కేసు

దేవరుప్పుల, జనవరి 9: పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సింగరాజుపల్లికి చెందిన గొంగళ్ల కృష్ణ, మేడ మధు, మేడ నరేశ్ గురువారం మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై ముగ్గురితో వెళ్తుండగా ఎస్సై తనిఖీ చేశారు. ఈ క్రమంలో వీరు ఎస్సైపై దురుసుగా మాట్లాడడంతో కేసు నమోదు చేశారు. ఎస్సై మాట్లాడు తూ మద్యం సేవించి ద్విచక్ర వాహనాలపై వెళ్తే ప్రమాదాలు జరుగుతాయన్నారు. ఆకతాయిలపై చర్యలు తీసుకుంటామన్నారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి

ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి



అధికారులతో జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న వినయ్‌కృష్ణారెడ్డి

జనగామ చౌరస్తా, జనవరి 9 : అభివృద్ధి పనుల్లో మరింత వేగం పెంచాలని రీహాబిలిటేషన్ అండ్ రీసెటిల్మెంట్ (ఆర్‌అండ్‌ఆర్) కమిషనర్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి టీ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రెవెన్యూ రోహిత్ సింగ్‌తో కలిసి పెండింగ్ పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని చర్లతండా, సత్యనారాయణపురం గ్రామాల్లో ఆర్ అండ్ ఆర్ సెంటర్ కింద పెండింగ్‌లో ఉన్న భూముల చదును వారం రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోని దేశాయితండాలో కూలీలకు పెండింగ్‌లో ఉన్న 50 శాతం బిల్లులపై టోకెన్ నంబర్‌తో వెంటనే నివేదికను సమర్పించాలని ఆర్డీవోకు సూచించారు. భూసేకరణలో భాగంగా ఆర్ అండ్ ఆర్ కింద గల భూముల ఆమోదానికి సత్వరమే ప్రతిపాదనలు పంపించాలని ఆయన కోరారు. సంబంధిత హక్కు పత్రాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, సీసీ రోడ్లు, తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించాలన్నారు. భూసేకరణ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని వినయ్‌కృష్ణారెడ్డి కోరారు. దీనికి అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి టెండర్లు పిలవాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో స్టేష న్ ఘన్‌పూర్ ఆర్డీవో వెంకన్న, యూనిట్ 1, 2 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమాన్ నాయక్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేయాలి : కలెక్టర్

ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో 5, 6, 8, 9వ తరగతిలో 2025-26 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశం పొందేందుకు జిల్లాలో అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓపెన్ కేటగిరి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. https.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా వచ్చే నెల ఫిబ్రవరి 1వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 23వ తేదీన ఉంటుందన్నారు. విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సకాలంలో జారీ చేయడం కోసం ఇబ్బందులు తలెత్తకుండా కలెక్టరేట్‌లో సహాయం కేంద్రం ఫోన్ నంబర్ 9052308621 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేంద్రం పనిచేస్తుందని కలెక్టర్ షేక్‌రిజ్వాన్ బాషా పేర్కొన్నారు.

సనాతన ధర్మాన్ని పరిరక్షించాలి

జనగామ చౌరస్తా, జనవరి 9 : సనాతన ధర్మ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ)జిల్లా బాధ్యులు శ్రీరాం ఉదయ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్‌లోని అభయాంజనేయస్వామి దేవాలయంలో వీహెచ్‌పీ సమావేశం నిర్వహించారు. శ్రీరాం ఉదయ్ మాట్లాడుతూ ధర్మ పరిరక్షణకు పాటుపడడంతో పాటు దేవాలయాల రక్షణ, గోసంరక్షణ నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు మంచాల రవీందర్, ప్రధాన కార్యదర్శి మోహన కృష్ణ భార్గవ, నర్సింహరా వు, బచ్చు నారాయణ, బుధారపు లావణ్య, శివకుమార్, శ్రీశైలం, నర్సిరెడ్డి, కృష్ణమూర్తి, రవి, సదన్ రావు, నాగరాజు, ఉపేందర్‌రెడ్డి, రాంబాబు, బాలరాజు, సోమనర్సింహచారి, రాథోడ్, కృష్ణమాచార్య, శివనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరుల కులం పేరును ప్రజాపతిగా మార్చొద్దని వినతి

బీసీ కమిషన్‌కు వినతిపత్రం ఇస్తున్న యాదగిరి తదితరులు

జనగామ, జనవరి 9 (నమస్తే తెలంగాణ) : కుమ్మరుల కులం పేరును ప్రజాపతిగా మారుస్తూ తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌పై కుమ్మర సంఘం రాష్ట్ర కమిటీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. గెజిట్‌లో కుమ్మర అనే పేరును మాత్రమే కొనసాగించాలని కుమ్మర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏనుగుతల యాదగిరి కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర బీసీ కమిషన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కుమ్మర పేరుకు పర్యాయ పదముగా ప్రజాపతి అనే పేరును గెజిట్‌లో చేర్చడం సరికాదన్నారు. తెలంగాణలో కుమ్మర్ల జీవన విధానం అన్ని కులాల సంస్కృతి, సంప్రదాయాలు, నాగరికతతో ముడిపడి ఉందని ఆయన తెలిపారు. ప్రజాపతి అనే పేరు తెలంగాణలో భిన్నంగా ఉందన్నారు. బలమైన వర్గాన్ని విభజించి బలహీనంగా ప్రభుత్వం దృష్టిలో చూపించే ప్ర మాదం ఉందని ఏనుగుతల యాదగిరి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాష్ట్ర నీలి గొండ లక్ష్మణ్, అసోసియేషన్ ప్రెసిడెంట్ కొన్నె సిద్ధులు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎదునురి శ్రీనివాస్. రాష్ట్ర కార్యదర్శి పిడిశెట్టి రాజు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలి

జిల్లా వ్యాప్తంగా సదస్సుల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు

దేవరుప్పులలో నిర్వహించిన ర్యాలీలో విద్యార్థులు, పోలీసులు

చిన్నపెండ్యాలలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

దేవరుప్పుల, జనవరి 9: రోడ్డు భద్రతతోపాటు ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉంటే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సడక్ సురక్షా అభియాన్‌లో భాగంగా గురువారం మండల కేంద్రానికి వచ్చిన ఆయన స్థానిక ప్రైవేటు పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులతో జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ రూల్స్, ప్రమాదాల నివారణపై శ్రీనివాస్‌గౌడ్ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

కొడకండ్లలో..

కొడకండ్ల, జనవరి 9 : ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మట్ ధరించాలని, దీంతో రోడ్డు ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చని ఎస్సై రాజు అన్నారు. వరంగల్ సీపీ అంబర్‌కిశోర్‌ఝా ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద ఎస్సై రాజు ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రోడ్డు భద్రతకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. అనంతరం విద్యార్థులు, పోలీసులతో ర్యాలీ నిర్వహించారు.

చిల్పూరులో..

చిల్పూరు : వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని జనగామ రూరల్ సీఐ ఎడవల్లి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాల ప్రభుత్వ పాఠశాలలో గురువారం రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం ప్రధాన చౌరస్తా నుంచి హైవే వరకు ర్యాలీ నిర్వహించారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని కోరారు. అతివేగంతో ప్రయాణం చేస్తే ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంపత్, కానిస్టేబుల్ ఇంద్రాచారి, మహేందర్ పాల్గొన్నారు.

ఉత్పత్తిదారులకు రెండున్నర నెలల పాల బిల్లులు చెల్లించాలి

విజయ డెయిరీ డీడీ సత్యనారాయణతో పాల ఉత్పత్తిదారులు

జనగామ రూరల్, జనవరి 9 : రెండున్నర నెలల నుంచి పాల ఉత్పత్తిదారులకు ఇవ్వాల్సిన బిల్లులను వెంటనే చెల్లించాలని పలువురు పాల ఉత్పత్తిదారులు కోరారు. ఈ మేరకు మండలంలోని పెంబర్తి, సిద్దెంకి గ్రామాలకు చెందిన రైతులు గురువారం జనగామలో విజయ డెయిరీ డీడీ సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. పాడి రైతులు పాల ఉత్పతితోనే కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. రెండున్నర నెలల నుంచి బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు నెలకొన్నాయన్నారు. దీనిపై స్పందించిన విజయ డెయిరీ డీడీ సత్యనారాయణ మాట్లాడుతూ రైతుల సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి బిల్లులు చెల్లించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ మడిపల్లి సుధాకర్ గౌడ్, ఆయా గ్రామాల పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు గుజ్జుల సంపత్, బీదని మల్లేశం, రైతులు గాజుల మల్లయ్య, జన్నే రాములు, చెన్నూరి మహేశ్, సంకటి ఎల్లయ్య, గోదల కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

తరిగొప్పుల, జనవరి 9 : మండలంలోని అక్కరాజుపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బోగం శ్రీనివాస్ తండ్రి రామస్వామి దశదిన కర్మ సందర్భంగా నాయకులు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పింగిళి జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రామాస్వామి మృతి కుటుంబానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధికార ప్రతినిధి చిలువేరు లింగం, గ్రామ అధ్యక్షుడు అంకం రా జారాం, నాయకులు దామెర ప్రభుదాసు, భూక్యా జూంలాల్‌నాయక్, వంగ రామరాజు, బూస యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వర్‌గౌడ్, జైపాల్, వెంకటేశ్, సంపత్, సోషల్ మీడియా కన్వీనర్ కొండ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హుండీల ఆదాయం రూ.3.91 లక్షలు

బచ్చన్నపేట, జనవరి 9 : మండలంలోని కొడవటూరు సిద్దేశ్వరాలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను దేవాదాయ శాఖ అధికారులు లెక్కించారు. ఆలయ ఈవో చిందం వంశీ పర్యవేక్షకులుగా మేకల వెంకటలక్ష్మి హాజరయ్యారు. హుండీల్లోని కానుకలను లెక్కించగా రూ.3.91లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో తెలిపారు. ఆలయంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బృంగి రూపాచైతన్య, ఆలయ ప్రధాన పూజారి ఓంన మశివాయ, సిబ్బంది లక్ష్మికాంత్‌రెడ్డి, బండారి శ్రీనివాస్ , గంగం భానుప్రకాశ్‌రెడ్డి, అర్చకులు సదాశివుడు, మహాశివుడు, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలు పేదలకందేలా చర్యలు

ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

దేవరుప్పుల, జనవరి 10: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులు కందితేనే ఫలితాలు బాగుంటాయని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు కృషి చేస్తున్నామని యశస్వినీరెడ్డి తెలిపారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, మండల అధ్యక్షుడు నల శ్రీరాం, ఎస్సీ, ఎస్టీ, బీసీ సెల్‌ల మండల అధ్యక్షులు భూక్యా సజ్జన్, ఇనుముల నాగరాజు, కాడబోయిన గణేశ్, నాయకులు కాసారపు ధర్మారెడ్డి, బోనగిరి యాకస్వామి, మొల్గూరి రమేశ్, పులిగిల్ల వెంకన్న, రెడ్డిరాజుల రమేశ్, వడ్లకొండ తార, మాసంపల్లి సాత్విక్ పాల్గొన్నారు.

దేవాదుల కాల్వల ద్వారా పంటలకు సాగునీరు

తానేదార్‌పల్లిలో కెనాల్ నీటి వద్ద రైతులు

స్టేషన్ ఘన్‌పూర్/జఫర్‌గడ్, జనవరి 9 : దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా స్థానిక రిజర్వాయర్ ప్రధాన కాల్వ నుంచి ఎల్1, ఎల్2 ఉప కాల్వలకు సాగునీరు విడుదల చేయడంతో ఆయకట్టు పరిధిలోని పంటలకు అందనున్నాయి. బుధవారం ప్రధాన కాల్వ ద్వారా ఎల్1 నుంచి ఎల్ 7 వరకు నీటిని విడుదల చేశారు. దీంతో గురువారం ఎల్1 కాల్వ ద్వారా విశ్వనాధపురం, తానేదార్‌పల్లి, తీగారం, ఎల్2 కెనాల్ ద్వారా ఇప్పగూడెం, సముద్రాల, ఎల్ 4 కెనాల్ ద్వారా రంగరాయగూడం కాశగూడం గ్రామాలకు సాగునీరు అందడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, జిల్లా నాయకుడు బెలిదె వెంకన్న, మార్కెట్ డైరెక్టర్ మాచర్ల కుమారస్వామి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు అనిల్, దుంపల పద్మారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ యాదగిరి, దుంపల సురేష్ రెడ్డి, కృష్ణమూర్తి, ఆకుల శ్రీనివాస్, యూత్ నాయకులు సందీప్ పాల్గొన్నారు.

తీగారంలో గోదావరి జలాలకు పూజలు చేస్తున్న రైతులు

తీగారం చెరువుకు గోదావరి జలాలు...

జఫర్‌గడ్ మండలంలోని తీగారం చెరువుకు గోదావరి జలాలు రావడంతో గ్రామస్తులు గురువారం పూజలు చేసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కెనాల్ ఏఈ వినోద్ కుమార్, మాజీ సర్పంచ్‌లు గోనె జయపాల్‌రెడ్డి, ఎల్కంటి స్వామి, రైతులు మనోహర్, కలకోట స్వామి, సింగపురం అశోక్, సంపత్, కుమార్, ప్రభాకర్, దిలీప్, సుధాకర్ పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడిగా వెంకన్న

కొడకండ్ల, జనవరి 9 : మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడిగా మండలంలోని ఏడునూతులకు చెందిన కడారి వెంకన్నను ఎన్నుకున్నారు. ఈ మేరకు నియామక పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు పోగుల సారంగపాణి, ప్రధాన కార్యదర్శి వీరమల్ల రాజు గురువారం నియామక పత్రం అందజేశారు. జిల్లా సంయుక్త కార్యదర్శి కడారి యాకేష్ పటేల్, జిల్లా ఉపాధ్యక్షులు పల్లె శ్రీనివాస్, పాలకుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షులు గట్టు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గీత కార్మికుడి మృతి

రఘునాథపల్లి, జనవరి 9: తాటిచెట్టు పైనుంచి జారిపడి గీత కార్మికుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. మల్కపురం మహేందర్ (40) గీత వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే గురువారం తాటిచెట్టు ఎక్కి కల్లుతీస్తున్న క్రమంలో కాలుజారి కిందపడడంతోఅక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

లక్నవరం జలాశయం వద్ద విద్యార్థులు

విద్యార్థులను అబ్బురపర్చిన చారిత్రక కట్టడాలు

దేవరుప్పుల, జనవరి 9: విద్యార్థులకు విద్యతో పాటు విహార యాత్రలు ఎంతగానో ఉపయోగపడుతాయని ప్రధానోపాధ్యాయుడు అంబటి అంజయ్య అన్నారు. మండలంలోని సింగరాజుపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గురువారం రామప్ప, లక్నవరం, వరంగల్ ఖిల్లా, వేయిస్థంభాల గుడి, భద్రకాళి, మినీ జూపార్క్‌లకు విహార యాత్రకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ క్షేత్రాలు, చారిత్రక కట్టలను, శిల్పసంపదను చూసిన విద్యార్థులు జీవితంలో మరిచిపోలేరని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు చైతన్య, ఆయా సోమలక్ష్మి పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి జరిమానా

రఘునాథపల్లి, జనవరి 9: డ్రక్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వ్యక్తికి కోర్టు జరిమానా విధించినట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్‌యాదవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని అశ్వరావుపల్లికి చెందిన దండిగా సంపత్ ఈనెల 3న పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. అతడిని గురువారం జనగామ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వెంకట్రాం నర్సయ్య ముందు ప్రవేశపెట్టారు. సంపత్‌కు రూ.500 జరిమానాతోపాటు ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ జడ్జి ఆదేశాలు ఇచ్చారని ఎస్సై వెల్లడించారు.